# రేపటి నిజం

చదువుకుని, ఉద్యోగం చేస్తున్న ఆధునిక యువతి మనస్తత్వాన్ని ప్రతిభావంతంగా చిత్రించిన కథ. నేటి సామాజిక వాతావరణంలో స్త్రీలు కోరుకుంటున్న స్వేచ్ఛ, పెళ్ళి విషయంలో వాళ్ళకున్న ఖచ్చితమైన అభిప్రాయాలు, పెళ్ళికి ముందు ఎయిడ్స్ టెస్ట్ ఆవశ్యకత... ఈ చిన్నికథలో సూటిగా, హృదయానికి తాకేలా చెప్పిన వైనం చేయి తిరిగిన విహారి లాంటి రచయితకే సాధ్యం. యువత కోరుకుంటున్న కొత్తలోకం దగ్గరవుతూ ఉందన్న ఆశావహ దృక్పథంతో కథ ముగించటం- రచయితకు సమాజం పట్ల ఉన్న నమ్మకానికి ప్రతీక.

- సలీం

కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత

నరసయ్యకీ, శారదమ్మకీ కూతురి పెళ్ళి- బాధ్యత కంటే బరువుగానే మారింది. వాస్తవం మరింత సన్నిహితమవుతూ వేధిస్తోంది.

రాత్రి- మాట మీద మాటగా గాలివాన సాగింది.

"నా జీవితం నా ఇష్టం!" అనేసింది రుక్మిణి. ఎండుపుల్లని విరిచినంత తేలిగ్గా చెప్పేసింది తండ్రి నరసయ్యకి. వెన్నున ఛళ్ళున చరిచినట్లు నిష్కర్షగా చెప్పేసింది తల్లి శారదమ్మకి. ఇద్దరికీ కలిపి ఠక్కున మొహాన్న తలుపేసినట్లు చెప్పింది.

తండ్రి మొహంమీద కోపంతో వైమార్కులూ, ఇంటూ మార్కులూ ఏర్పడినై. అణచుకున్న కోపం, ఉద్రేకం మరి!

తల్లి మొహం పాలిపోయింది. ఆవేదనా, అసహాయతా మరి!

'మొండిఘటం! అమ్మ లక్షణాలొచ్చినై దీనికి!' అనుకున్నాడు నరసయ్య. భార్యకేసి గుర్రుగా చూశాడు.

'పెంకితనంలో ఆ అయ్య పోలికే!' అనుకుంది శారదమ్మ. భర్తకేసి అవ్యక్త నిరసనతో చూసింది.

"చిన్నపిల్లా, ఏమన్నానా? ఇరవై నాలుగేళ్లొచ్చినై శరీరం మీదికి. పైగా పాతికవేల ఉద్యోగం చేస్తున్న మనిషి. కొట్టే వయసా? తిట్టే పరిస్థితా?" అని అనుకున్నారు ఇద్దరూ. విడిగానూ, ఎవరికి వారుగానూ... కలగలిపి మాటలు కలబోసుకుంటూ జాయింట్‌గానూ.

జరిగిందేమిటంటే -

పెళ్ళి ప్రసక్తి తెస్తూనే వున్నారు- అమ్మా, నాన్నా.

"మీరు సంబంధం చూసి నాకు చెప్పండి. నా ఆలోచనలు నాకున్నై. వచ్చిన వివరాల్ని బట్టి నేనా అభ్యర్థితో మాట్లాడతాను..." అన్నది రుక్మిణి.

కూతురి మాటలకి తల్లీతండ్రీ విస్తుబోయారు. ఏమేమో గొణుక్కుని మోకాళ్లల్లో తల యిరికించుక్కూచున్నారు.

రుక్మిణి ఇంజనీరింగ్ పూర్తిచేసింది. సాఫ్ట్‌వేర్ కంపెనీలో చేరింది. ఏడాదిలోపే ఆమె జీవనశైలి మారిపోయింది. శని, ఆదివారాలు ఔటింగ్. ఇంట్లో తిండి తగ్గింది. బయటి జంక్‌ఫుడ్‌కి క్రమేపీ అలవాటు పడింది. అర్ధరాత్రీ, అపరాత్రీ కాల్ టాక్సీల్లో ఇంటికి చేరుకుంటోంది.

నాలుగైదు సంబంధాలు చూసి ఆమెకు చెప్పారు తల్లీతండ్రీ.

ఆ అభ్యర్థుల్ని ఇంటర్వ్యూ చేసింది రుక్మిణి. కొందరిని నెట్‌లోనూ, కొందరిని కలుసుకునీ, వారి వారి ఇళ్లకీ వెళ్లొచ్చింది- వీలైన చోట్ల. చివరికి "నో యూజ్! వాళ్ళ అభిరుచులకు నా జీర్ణకోశం చెడిపోయింది..." అని జోక్ చేసింది.

"ఎందుకనే?" అని నిగ్గదీస్తే...

"చెప్తా... చెప్తా... తగిన సమయంలో మీకే తెలుస్తుంది!" అని ఊరుకుంది.

స్వరం తగ్గించటం, శ్రుతి పెంచటం, రాగం తీయటం- ఇవన్నీ ఆ ముగ్గురి సంభాషణల్లోనూ- వివిధ స్థాయిల్లో సాగినై. ఇంట్లో తరచుగా, కినుకలూ, అలకలూ, ఉపవాసాలూ కూడా జరిగినై.

"ఆడపిల్లలకి అణకువా, ముందుచూపూ ఉండాలమ్మా!" అని తల్లి ఏదో చెప్పబోతూంటే- రుక్మిణి సన్నగా నవ్వుతూ "అదేలేవే... ఉన్నది!" అని తేల్చిపారేస్తుంది.

ఇద్దర్నీ కలిపి ఏదేదో అనేద్దామనేంత కోపం నరసయ్యది. కానీ, అనడు. కదిలిస్తే ఇల్లంతా కూలుతుందేమోననే భయం. ఏతావాతా ఇంటి వాతావరణం- ఇటీవల పట్టపగలు కూడా అర్ధరాత్రి చీకటి లాగానే ఉంటోంది.

ఇదిగో... ఇప్పుడు-

రాత్రి పదయింది... రుక్మిణి ఇంకా రాలేదు.

బయటినుంచి చల్లగాలి వీస్తున్నది...

కానీ, లోపలి సెగ– నరసయ్యనీ, శారదమ్మనీ ఉసూరుమనిపింప జేస్తున్నది. ఇద్దరి చూపులూ గుమ్మంపైనే తారట్లాడుతున్నాయి.

"అసలీ పిల్ల కోరికలేమిటో చెప్పిచస్తే కదా తెలిసేదీ, ఏమన్నా చెయ్యగలిగేదీ..." విసుగ్గా అన్నాడు నరసయ్య– హాల్లో పచార్లు చేస్తూ.

"అదేగా నేనేడ్చేదీ..." వేష్టపడింది శారదమ్మ.

"నెలరోజుల క్రితం– ఆ వివాహవేదిక వేదిక వాళ్ళిచ్చిన రాజీవ్ వివరాలిచ్చాం. ఎటూ తేల్చదు. ఏమీ చెప్పదు."

ఒళ్ళు మండి, కొంచెం కోపంగా అంటూ గుద్దెల్థిజేస్తే... "నా జీవితం నా ఇష్టం!" అని ఠక్కున అనేసింది. కన్నవారి ప్రాముఖ్యాన్ని నేలమీద వెతుక్కోమన్నట్లు కాళ్లు టటతటలాడిస్తూ వెళ్లిపోయింది. మోయలేని బరువుని చేతులు మార్చుకుంటున్నట్లు మాటలు కలబోసుకుంటూ కూచున్నారు భార్యాభర్తలు.

క్షణాల్లోనే వచ్చింది రుక్మిణి.

ఫ్రిజ్‌లో నీళ్లు తాగొచ్చి "హమ్మయ్య" అంటూ సోఫాలో కూలబడింది.

తల్లిదండ్రుల్ని పరీక్షగా చూసింది. తానే వాళ్ళ ఆలోచనలకి కేంద్రమని ఆమెకు తెలుసు. వారి జంకుని తేలిక పరుస్తూ చెప్పింది– "రాజీవ్ వాళ్ళ ఇంటికి వెళ్లొస్తున్నాను. రేపు తన నిర్ణయం చెప్తానన్నాడు."

ఒక్క క్షణం ఆగింది. తల్లి మొహాన్న తారాడుతున్న భయసందేహాల్నీ, తడికళ్ళనీ చూస్తూ "పిచ్చితల్లిలా ఆలోచిస్తూ ఆరోగ్యం చెడగొట్టుకోకమ్మా!" అన్నది.

కూతురి మాటల్లోని సాత్వికత నరసయ్య మనసునీ ఆర్ద్రం చేసింది. ఏవేవో ఆలోచనలు ముసిరినై. అవన్నీ సాంద్రంగా ఆయన ముఖంమీది అనుభవాల ముడుతల్లో కలిసినై. బయటికి చూస్తూ ఉండిపోయాడు.

ఆకాశంలో మబ్బులు కలుస్తున్నట్లు కనిపిస్తున్నా, గాలికి తేలిపోతున్నై!

●

హోటల్లో– రుక్మిణీ, రాజీవ్... కాఫీ తాగుతున్నారు.

దిక్కులు చూస్తూ మొదలెట్టాడు రాజీవ్–

"చూశారు గదా... నాకు ముగ్గురూ చెల్లెళ్ళే. వాళ్ళ పెళ్ళిళ్ళ గురించే మా అమ్మానాన్న భయం, ఆందోళనా. నాకూ ఆ బాధ్యత ఉంటుంది గదా! మా నాన్న తాను చేస్తున్న చిన్నాచితకా కాంట్రాక్టుల్లో బాగా నష్టపోయి ఉన్నాడు. అందుకని మావాళ్ళు కట్నం బాగానే ఆశిస్తున్నారు..." అని ఓ క్షణం తర్వాత "కనీసం పది లక్షల దాకా!" అన్నాడు.

రుక్మిణి అతని వైపు చురుగ్గా చూసింది.

'ఈ నెలరోజుల్లో నా మీద ఒలకబోసిన ప్రేమ ఇప్పుడు అతని గుటకల్లో కూరుకుపోతోంది' అనిపించింది. 'నెలకి పాతికవేల జీతం. ప్లస్ పది లక్షల కట్నం! నా విలువని బాగానే కనుగొన్న మహాశయుడు!' అనుకుంది. నవ్వొచ్చింది. సన్నగా నవ్వింది.

చెమటతో తడిసిన అరచేతుల్ని కర్చీఫ్‌తో తుడుచుకున్నాడు రాజీవ్.

"సరే... రెండో విషయం?" అడిగింది రుక్మిణి.

"కొడుకూ, కోడలూ వాళ్ళతోనే ఉంటే ఖర్చు కలిసొస్తుందని భావిస్తున్నారు వాళ్ళు. నాలుగు రాళ్లు కూడబెట్టుకొని, ముందు పెళ్ళిళ్ళ బాధ్యత తీర్చుకోగలిగితే ఆ తర్వాత విషయం తర్వాత చూసుకోవచ్చంటున్నారు. నాక్కూడా వాళ్ళు చెప్పేది సబబుగా వుందనిపిస్తోంది..." నిస్సంశయంగా చెప్పేశాడు.

"శుభం!" ఠక్కున అన్నది రుక్మిణి.

గతుక్కుమని ఆమె కళ్ళల్లోకి చూశాడు రాజీవ్.

రుక్మిణి కూడా చూపు నిలిపి సూటిగా అతని కళ్ళల్లోకే చూస్తూ- "సరి..." అని ఆగింది. 'జీవితపు కోరికలన్నీ ఒక్క ఆడపిల్లే చెల్లించాలనే స్వార్థం' అనిపించింది. ఉద్వేగాన్ని నిబ్బరించుకుంది. తాపీగానే అడిగింది -

"మరి, మూడో విషయం?"

కనుబొమలు పైకెత్తి, తల ఎగరేస్తూ పక్కటేబుల్ దగ్గరి మనుషుల్ని చూస్తూ రుక్మిణి నుద్దేశించి సమాధానమిచ్చాడు రాజీవ్-

"అది నాకే అసలిష్టం లేదు. ఆ సస్పెన్స్‌నీ, అవస్థనీ నేను ఊహించలేను. అయినా ఉన్న ప్రాణాన్ని హాయిగా ఉండనీయకుండా తీసికెళ్లి కరెంట్ తీగమీద ఆరేసుకునే రిస్క్ ఎందుకు?"

ఇప్పుడు రుక్మిణికి ఉక్రోషం ముంచుకొచ్చింది. పెదవులు వణికినై-

"అంత రిస్కుంటుందని ఆలోచిస్తున్నావంటే..." అని ఆగి, "నీకూ ఆ అనుమానం ఉందన్నమాట!" అంటూ అమాంతం లేచి వచ్చేసింది.

ఆవేశంతో గుండె బరువెక్కింది...

ఆలోచనలతో మేధ కూడా దిమ్మెక్కిపోయింది. మనుషులంటేనే ఏదో ఏహ్యం రేగింది. పొంతన లేని ఊహలూ, తలపులూ, నెగిటివ్ భావనలూ... మనసును చిందరవందర చేసినై. శరీరం తూలిపోతోందనిపించింది. తనువుని స్వాధీనంలోకి తెచ్చుకుని ఆటోలో కెక్కేసింది.

ఆ రాత్రి- అమ్మానాన్నలకి విషయం చెప్పింది రుక్మిణి.

తన గదిలోకి వెళ్లటానికి ముందు వాళ్ళతో ఒక మాట కూడా అన్నది- "నే చెప్పేవరకూ మళ్లీ నా పెళ్ళి గురించి ప్రస్తావించకండి!" అని.

అది వింటున్న ఇద్దరూ విస్తుపోయారు. ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. క్షణాల తర్వాత తెప్పరిల్లి "అదేమిటే..?" అన్నది శారదమ్మ ప్రశ్నార్థకంగా.

నరసయ్య చూస్తున్నాడు- 'కూతురేం చెప్తుందా...' అని.

"అవును. నేనేమీ సీతా, సావిత్రీ బాపతు కానక్ఖర్లేదు. జీవితం జీవితమే. నాకది ఎంతో విలువైనది. నాకు నేనుగా దాన్ని కన్నీటిమయం చేసుకోలేను. నా జీవితం నా ఇష్టం!"

అదే మాట! ఆమె పలుకుల్లో కొండంత ఆత్మస్థైర్యం!

"ఇంతకీ..." అని ఏదో నసిగింది శారదమ్మ.

వేదాంతిలా నవ్వి గదిలోకి వెళ్లిపోయింది రుక్మిణి.

ఆమె ఆలోచిస్తోంది...

కాలం మారుతోందని అరుస్తారే గానీ, ఆడపిల్ల ఒక్క అడుగు ముందుకేసినా భరించలేరు. ఈ మగవాళ్ళ మాయల్నీ ఎవరూ గమనించలేరు.

ఇంతకీ తాను కోరరానిదేం కోరిందీ?

కట్నం ఇచ్చేది లేదన్నది. ఉమ్మడి కుటుంబంలో ఇతరుల స్వేచ్ఛని హరిస్తూ, తమ స్వేచ్ఛని హరింపజేసుకుంటూ, ఇరుకు మనసులతో ఉండనన్నది. మూడోది- ఇద్దరికీ ఎయిడ్స్ టెస్ట్ కావాలన్నది!

అవును... ఈనాటి సామాజిక వాతావరణంలో ఈ మూడూ అవసరమే. తనలాంటి యువతి ఈమాత్రం స్వేచ్ఛకీ, హక్కుకీ అర్హురాలు కాదా? న్యాయానికివన్నీ ఆడపిల్లల తల్లిదండ్రులకి రేపోమాపో తెలిసితీరాలి. తానూ తీరిగ్గా అమ్మకీ, నాన్నకీ చెప్పాలి!

మంచం మీద వాలింది. నిండుగా, హాయిగా ఊపిరి పీల్చుకుంది.

మసక మసగ్గా... మబ్బు మబ్బుగా... కునుకు... కళ్ళముందు... ఏదో కొత్త లోకం... అది,

దగ్గరవుతున్నట్లే వున్నది!!!

'ఆకాశవాణి'లో ప్రసారమై... ఆ తర్వాత
'గ్రంథాలయ సర్వస్వం' మాసపత్రిక ... జనవరి' 2009 సంచికలో ప్రచురితమైన కథ